కథ

# పరుగు

## శివన్

ప.. రు.. గు. చావుకి బ్రతుక్కి మధ్య పరుగు. అరక్షణం నిర్లక్ష్యంతో ఆలస్యంగా అడుగు ముందుకు వేస్తే మృత్యువు మూర్ఖుల రూపంలో వచ్చి కర్కశంగా కబళించి వేస్తుంది. అందుకే పరుగు.

చుట్టూ కటికచీకటి. కన్ను పొడుచుకున్నా ఏమీ కనబడటం లేదు. ఎన్ని గంటలనుండి పరుగెడుతున్నామో తెలియదు. చెట్టు, పుట్ట... గుట్ట దాటుకుంటూ పరుగెడుతున్నాము. నరనరాన నిగూఢంగా నిక్షిప్తం చేసుకున్న శక్తి సైతం చెమటరూపంలో ఆవిరైపోతుంటే ఆయాసం ఊపిరిరూపంలో ఎగిసెగిసి పడుతోంది.

చెట్టు చేమ ఒంటిని గాయపరిచినప్పుడల్లా మనసు బాధతో కీచుగా అరుస్తుంది. రాయిరప్ప కాళ్లని బలంగా తాకినప్పుడల్లా

Ranga

ప్రాణం విలవిల్లాడుతుంది. అయినా సరే ఆగకూడదు. పరుగెత్తాలి. మా ఉనికిని శత్రువుకు అందకుండా ఆసరాగా నిలిచిన చీకటిని విచ్ఛినం చేసి తూరుపు కొండల్లో వెలుగు కన్ను తెరువక ముందే దూరంగా పరుగెత్తాలి. ఈ దేశ సరిహద్దులు దాటిపోవాలి.

ఒక మనిషి ఆనందంగా బ్రతకాలంటే కులానికి, మతానికి కట్టుబడి వుండటం అంత ముఖ్యమా...?

అదే నిజమైతే ఈ దేశంలో కనీసం కోటికి తొంభై లక్షల మందైనా ఆనందంగా బ్రతుకుతూ వుండాలి. కాని అలా ఎంతమంది ఆనందంగా బ్రతుకుతూ వున్నారు? దాదాపు అందరూ ఏదో ఒక అసంతృప్తితోనే జీవిస్తున్నారు.

కులాలకు మతాలకు కట్టుబడి జరుగుతున్న పెళ్లిలతో ఎంతోమంది అమ్మాయిలు ఏదో ఒక కారణాన వేధింపబడుతూనే వున్నారు.

మరి అలాంటప్పుడు ఏ ఆనందం సంతోషం లేనప్పుడు మేము మాత్రం ఎందుకు కులానికి మతానికి కట్టుబడి వుండాలి.?

మృత్యువులో సైతం మేము కలిసే జీవించాలని అనుకుంటుంటే మొజహిర్ పఠాన్‌లంటూ మమ్మల్ని ఎందుకు విడదీస్తుంది ఈ వ్యవస్థ. మా స్వేచ్ఛని, ఆనందాన్ని నియంత్రించడానికి వీళ్ళంతా ఎవరు? మాకు మరణశిక్ష విధిస్తూ 'ఫత్వా' జారీ చేయడానికి హక్కు ఆ 'ముల్లాల'కు ఎవరు ఇచ్చారు?

ఈ ప్రపంచంలో ఎవరూ క్షమింపరాని అపరాధం మేము ఏం చేశామని? తల్లిదండ్రుల ఇష్టాలను ధిక్కరించి ఒకరినొకరం ఇష్టపడి పెళ్లి చేసుకోవాలనుకోవటమేనా మేము చేసిన అతి పెద్ద నేరం?

అదే నిజమైతే ఈ ప్రపంచంలో ఎంతమంది ముస్లీంలు 'ఖురాన్'ను ధిక్కరించి ప్రేమవివాహాలు చేసుకోవటంలేదు?

మరి వారిపట్ల ఎవరూ 'ఫత్వా' జారీ చెయ్యరేమి? వారికొక నీతి మాకొక నీతినా?

అయినా మేము మతాన్ని ఉల్లంఘించటంలేదే? మేము ఇద్దరము ముస్లీంలమే కదా!

మాపట్ల విధించింది ఫత్వా కాదు వివక్ష. ఒక బలవంతుడు బలహీనుడిపట్ల ప్రదర్శించే డామినేషన్ అది.

కాని నాకు తెలిసిందల్లా ఒక్కటే పూర్వజన్మలో మన రూపమేమిటో మనకు తెలియదు. మరుజన్మ వుందోలేదో అసలే తెలియదు. ఈ జన్మ ఎప్పుడు ముగుస్తుందో అంతకంటే తెలియదు. అందుకే బ్రతికిన నాలుగురోజులు ఆనందంగా బ్రతకాలి. కాబట్టి 'ఏం చేస్తే నువ్వు ఆనందంగా వుంటావో అలాగే జీవించు' అనేది నా బలమైన అభిమతం. అలాగని ఆడవాళ్లని భరితెగించమని, మగవాళ్లని అడ్డదారుల్లో నడవమని కాదు నా ఉద్దేశ్యం. చంపుకున్న కోరికల్ని మరుజన్మలో తీర్చుకునే అవకాశం లేదు. అందుకే ఈ జన్మని అసంతృప్తిగా ముగీయనీయకంటాను.

ఆ సంతృప్తి కొరకే ఈ ప.. రు.. గు.. పరుగుకాదు. ఆమెతో పారిపోవటం, అంటే ఈ సమాజం దృష్టిలో లేచిపోవటం.

ఒక అమ్మాయి అబ్బాయి ఇంట్లో చెప్పాపెట్టకుండా లేచిపోవటం అనేది ఎంత తెలివి తక్కువతనమో అంత పెద్దతప్పు అని కూడా నా ఉద్దేశ్యం.

కాని ఈ తప్పు తప్పదు. ఎందుకంటే నాకు ఆమె స్నేహం కావాలి. ఆమెకు నా అనురాగం కావాలి. నాకు ఆమె ఆత్మీయత కావాలి. ఆమెకు నా సాంగత్యం కావాలి. నాకు ఆమె సాన్నిహిత్యం కావాలి. ఇంకా చెప్పాలంటే మేము ఒకరికి మరొకరం కావాలి. అంతేచాలు మాకు. మాకు ఆస్తులు వద్దు, అంతస్థులు వద్దు. మతాలు, కులాలు మరేవి వద్దు. మా మానాన మమ్మల్ని బ్రతుకనిస్తే మాకు అదే చాలు.

కాని మమ్మల్ని ఎవరూ అర్థం చేసుకోరేం? అంతా మూర్ఖులు.

"మనమంతా మనుషులం. మనుషులంతా ఒక్కటే" అన్నాను.

"కాదు, నువ్వు మొజహిర్‌వి. మేము పఠాన్లం" అన్నారు వాళ్లు.

"అయినా నేను ముస్లీమ్‌ని కాదా?" అన్నాను.

"అందుకే ప్రేమవ్యవహారం నడిపి నువ్వు ఖురాన్‌ని ధిక్కరిస్తున్నావ్. మన ఇస్లాంను అవహేళన చేస్తున్నావ్' అని అంటున్నాము అంటూ మండిపడ్డారు వాళ్లు.

"ఖురాన్‌ని ధిక్కరించడానికి నేను నమాజ్‌ని ఉదయం ఎనిమిది గంటలకు, మధ్యాహ్నం రెండుగంటలకు చేయటం లేదూ. రంజాన్ ఉపవాసాన్ని పాటించక పోవటంలేదూ. జీవితమనే మజిలిలో ఎదురయ్యే అనేకమైన ఆటుపోట్లని ఎదుర్కొని చివరి మజిలివరకు నాకు తోడుగా నిలిచే అమ్మాయిని నేను ఎంచుకున్నానే గాని ఇస్లాంని అవహేళన చేయలేదు.


మీరంతా ఇస్లాం ఖురాన్ అని గుండెలు బాదుకుంటున్నారే... ఇండియా, బంగ్లాదేశ్‌లలో ఎంతోమంది ముస్లీంలు హిందువుల అమ్మాయిల్ని పెళ్లి చేసుకుంటున్నారు. ప్రపంచంలో ఎంతోమంది ముస్లీంలు ప్రేమవివాహాలు చేసుకుంటున్నారు. వీరందరి మూలంగా కానిది కేవలం మా మూలంగానే ఖురాన్ ఉల్లంఘన జరుగుతుందా?" అంటూ వాదించాను.

కాని ఈ ప్రపంచంలో ఎక్కడైనా బలవంతుడు బలహీనుడిపట్ల ధనవంతుడు దరిద్రుడి పట్ల ఒకేరకంగా ప్రవర్తిస్తారు. నాపట్ల అదే జరిగింది.

"రేయ్...కున్వర్ ఆషాన్ మా అమ్మాయి రిఫాత్ ఆఫ్రీదికేసి మరోసారి కన్నెత్తి చూస్తే ఊపిరి పీల్చుకోవడానికి వంట్లో ప్రాణం వుండదు" అంటూ నా కుత్తుకమీద కత్తులుపెట్టి కర్కషంగా హెచ్చరించారు.

కాని అంత సులువుగా ఆమె మరుపుకొస్తే అది 'ప్రేమ' ఎలా అవుతుంది. అంతే ఈజీగా నా మనసులోంచి ఆమె అంతర్థానమైతే అది అనురాగమెలా అవుతుంది? అందుకే "మరణంలోనూ ఆమెనే ప్రేమిస్తాను" అన్నాను. అందుకు ప్రతిఫలం నామీద దౌర్జన్యం.

డబ్బులు వెదజల్లి, పోలీసులతో కుమ్మక్కై, కేసులో ఇరికించి లాఠీలతో కుళ్లబొడిచారు. నన్ను



హత్యచేసే ప్రయత్నంలో తుపాకి పేల్చి నా వెన్నుముకని గాయపర్చారు. పంచాయితీ పెట్టించి 'ముల్లాల'తో ఫత్వా జారీ చేయించారు.

కాని మా ప్రణయం మొజహిర్ పఠాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులు, హత్యలు... లూటీలు, దహనకాండలతో రెండుమార్లు కరాచి పట్టణం అతలాకుతలమై అనేక మంది ప్రాణాలని హరిస్తుందని మేము ఏనాడూ కలలో కూడా ఊహించలేదు.

ఇప్పుడు మరోసారి...

ఇద్దరం పారిపోయామన్న విషయం ఇంట్లో గ్రహించే లోపులో ఈ దేశ సరిహద్దులు దాటి వెళ్లిపోవాలన్న మా ప్రయత్నం కంటే వేగంగా... మేము కనీసం కరాచి నగరం కూడా దాటకముందే, మేము పారిపోయామన్న విషయం దావానలంలా దేశసరిహద్దుల వరకు ప్రాకిపోయింది. అంతే... మొజహిర్ పఠాన్ల మధ్య మళ్లీ దాడులు ప్రతిదాడులతో నగరం అతలాకుతలం అయింది.

వాళ్లు మాకోసం దేశం నలుమూలలా ప్రతి అంగుళం వెతుకుతారని మాకు తెలుసు. వాళ్లకు చిక్కితే మరణమే మాకు చివరి మజిలి. అందుకే సాధ్యమైనంత త్వరగా ఈ దేశ సరిహద్దులు దాటి ఇండియా చేరాలి. అదే మాకు సురక్షితమైన దేశం. అందుకే వ... రు... గు...

శ్వాస ఎగిసి పడుతోంది. కాళ్లలో శక్తి క్షీణించిపోతోంది. చెమట ధారలు కడుతోంది. చీకటిని, గాలిని చీల్చుకుంటూ పరుగెడుతున్నాం.

పరుగెడుతున్న నాలో క్షణం కలిగిన సందేహం సంకోచాన్ని కలిగించింది. పక్కకు తిరిగి చూశాను. ఆమె కనబడలేదు. చప్పున ఆగాను. గాబరాగా చుట్టూ కలియచూశాను. తన జాడ కనబడలేదు.

"రిఫాత్.... రిఫాత్" దిక్కులు పిక్కటిల్లేలా పిలిచాను.

సమాధానం శూన్యం. అనుమానం నన్ను మరింత ఆందోళనకు గురిచేసింది. అంతే.. ఎంత వేగంగా పరుగెత్తుకొచ్చానో అంతకంటే వేగంగా మళ్లీ వెనక్కి లంఘించాను.

అప్పటివరకు నా పక్కనే పరుగెత్తుకు వచ్చిన తను ఉన్నట్టుండి కనబడకపోవటం నన్ను విపరీతమైన ఆందోళనకు గురిచేసింది. ఆమె అంతర్ధానమవటం నన్ను ఒక్కసారిగా నిరాశ నిస్పృహలకు గురిచేసింది. నిస్సహాయత అసహనానికి లోను చేసింది. ఎవరిమీదో కోపం, మరెవరిమీదో ద్వేషం. ఒక్క వేటుతో ఎవరినో రెండుగా చీల్చి పారేయాలన్న అర్థరహితమైన ఆవేశం. ఇన్నాళ్లు ప్రాణపదంగా చూసుకున్న అమూల్యమైనదేదో కోల్పోయానన్న ఫీలింగ్. నాకు ఏడుపొచ్చింది. అలాగే నేలమీదకు జారాను. నేలకేసి తల బద్దలు కొట్టుకుని చనిపోవాలనిపించింది. కన్నీళ్లు చెక్కిళ్ల మీదుగా జలపాతమై జారాయి. నాకు మొదటిసారి 'అల్లా' పట్ల ద్వేషం కలిగింది.

చిన్న అలికిడి, అది గాలి కౌగిళింతకి వళ్లు విరుచుకున్న ఆకుల సవ్వడి కాదని తెలుసు. చప్పున అటుకేసి చూశాను. ఊపిరి బిగపట్టి చెవులు రిక్కించాను. చిన్నగా మనిషి మూలుగుతున్న శబ్దం.

ఆ మాత్రం చాలు ఆమె ఉనికిని నా మనసు పసిగట్టడానికి రివ్వున పరుగెత్తాను అటుకేసి.

ఆమె నిస్త్రాణంగా పడిపోయివుంది. ఆందోళనగా పడిలోకి తీసుకున్నాను.

"రిఫాత్... రిఫాత్" ఆమె బుగ్గలమీద బలంగా తడుతూ పిలిచాను. ఎక్కడో ఆగాధంలోంచి పలికినట్టు "ఊ.." అంది.

"ఏం జరిగింది రిఫాత్.. నీకేం కాలేదు కదా?" ఆందోళనగా అడిగాను.

సమాధానంగా తన చేతులతో నా బుగ్గలమీద ఆప్యాయంగా స్పృశించింది. ఆమె సురక్షితంగా వుండటం నాకు ఆనందాన్ని కలిగించింది.

"పదా... త్వరగా పరుగెడుదాం" దిక్కులు పరిశీలిస్తూ చెప్పాను.

"నావల్లకాదు కున్వర్... నేనింకా పరుగెత్తలేను. కాళ్లు పీకుతున్నాయి. నాకు బాగా ఆకలిగా వుంది. ఏమైనా తినిపించవూ?" అభ్యర్థనగా అడిగింది.

నా హృదయం చలించిపోయింది. కాని నేనేం సమకూర్చగలను? అడవిలాంటి నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో ఆమె ఆకలిని తీర్చాలంటే, ఆమెను అక్కడే ఒంటరిగా వదిలేసి మళ్లీ గంటకుపైగా వెనక్కి ప్రయాణించాలి. కాని ఇప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యంకాని పని.

"ప్లీజ్ కున్వర్.. నాకేమైనా తినిపించవూ?"ఆకలిని తట్టుకోలేక ఆమె ఏడ్చినంత పనిచేసింది.

తనకు కనీసం మంచినీళ్లు కూడా సమకూర్చలేని నా దుస్థితికి బాధ కలిగింది. దుఃఖం పొంగుకొచ్చింది. ఆమెను గుండెలకేసి లాలనగా హత్తుకున్నాను. నా కళ్లలోంచి రాలిపడిన రెండు కన్నీటిబొట్లు ఆమె నుదురును స్పృశించి క్షమాపణ అడిగాయి.

"నన్ను క్షమించు రిఫాత్. నువ్వు సేద తీరడానికి నా పడిని పాన్పులా సమకూర్చగలను. నీ ఆకలి తీరుతుందంటే నా ప్రాణాన్ని ఇవ్వగలనే కాని ఈ స్థితిలో కనీసం నీకు దప్పిక కూడా తీర్చలేని అసమర్థుడని" క్షమాపణగా చెప్పాను.

ఆమె నా తలని అనునయంగా తట్టింది.

"సారీ కున్వర్. ఇప్పుడు మనమున్న పరిస్థితి ఏమిటో తెలిసికూడా నిన్ను ఇబ్బంది పెట్టాను. నన్ను మన్నించు కున్వర్" అంటూ నా పడిలో మరింతగా గువ్వలా ఒదిగిపోయింది. ఆమె నీరసంతో రొప్పుతుండటం నాకు స్పష్టంగా తెలుస్తుంది.

మామధ్య నిశ్శబ్దం చాలాసేపు పరుచుకుంది. మా గమ్యాన్ని గుర్తుచేస్తూ గాలి దుమారం మొదలైంది.


"బయలుదేరుదామా? సరిహద్దుకు మనం చాలా దగ్గరగా వచ్చేశాము. మరో రెండు గంటలు ప్రయాణం చేస్తే చాలు సరిహద్దు దాటేస్తాము. త్వరగా బయలుదేరితే మంచిది. వాళ్లు మనని ఏక్షణంలోనైనా చుట్టుముట్టవచ్చు" హెచ్చరించాను.

"నా వల్ల కాదు కున్వర్" ఆమె బాధగా మూలిగింది.

అప్పుడు చూశాను చెప్పులు లేకపోవటం వలన చిట్లి రక్తం స్రవిస్తున్న ఆమె పాదాలని. మునిపన్నిట అదిమిపెట్టుకుంటున్న బాధని.

నా మనసు చిద్రమైంది. కర్చీఫ్‌తో ఆమె పాదాలని సుతారంగా తుడ్చాను. ఆ స్థితిలో ఆమెను అలా చూస్తుంటే నా మనసు విలవిల్లాడింది. ఆమె కనీసం నాలుగు అడుగులు కూడా నడువలేదని ఇట్టే తెలుస్తుంది. అలాంటి స్థితిలో నడువమని ఒత్తిడి చేయటం భావ్యం కాదనిపించింది.

ఆమెను భుజాలమీద వేసుకుని ముందుకు సాగే ప్రయత్నం చేయబోయాను. ఆమె వారించింది.



"నాకు భయంగా ఉంది కున్వర్. సరిహద్దు దాటాక మనం పాకిస్తానీయులమని తెలిస్తే భారతీయులు ప్రాణాలతో వదిలిపెట్టరు. ఎక్కడో పరాయిదేశంలో మనం ప్రాణాలు వదలటం కంటే ఇక్కడే మనవాళ్ల చేతుల్లో, జన్మనిచ్చిన ఈ నేలమీద ప్రాణాలు వదలటం కొంత సంతృప్తిగానైనా వుంటుంది" అంది.

అంత టెన్షన్‌లోనూ నాకు నవ్వొచ్చింది ఆమె అపోహకి.

"రిఫాత్.. నువ్వు అనుకుంటున్నట్టుగా భారతీయులు అలాంటివారు కారు. ముష్కరులు అంతకంటే కారు. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే భారతీయుల పట్ల ద్వేషపూరితమైన భావాన్ని ప్రతి పాకిస్తానీయుడి మనసులో బలంగా చొప్పించడంలో మన రాజకీయనాయకులు సఫలీకృతులయ్యారు. అలాంటి అపోహకు నువ్వు గురికావటం నేను సిగ్గుపడుతున్నాను."

"నువ్వు ఏమైనా చెప్పు. నాకెందుకో భయంగా అనిపిస్తుంది." ఆమె గొంతు జీరపోయి ముఖంలో భయం స్పష్టంగా కనబడింది.

కాని, ఎన్నో ప్రయాసాలకు తట్టుకుని సరిహద్దువరకు చేరుకున్నాక చివరి క్షణంలో ఆమె మనసు మార్చుకోవటం నాకు ఇబ్బందిగాను, అయోమయంగాను తోచింది.

"భారతీయులంటే నీకు అంత భయమెందుకో నాకు బోధపడటంలేదు రిఫాత్. వాళ్లు చాలా మంచివాళ్లని నా బలమైన నమ్మకం."

దేశవిభజన జరిగాక భారతీయులు మనమీద ఎప్పుడూ యుద్ధాన్ని ప్రకటించలేదు. చావుదెబ్బ తిన్నా సిగ్గులేకుండా ప్రతిసారీ కయ్యానికి కాలు దువ్వుతున్నది మనమే. ఇప్పటికీ సరిహద్దుల్లో మూర్ఖుల్లా కవ్వింపు చర్యలు జరుపుతున్నది మనమే. యుద్ధం చేయాలని వాళ్లు ఏనాడు కోరుకోలేదు. స్నేహం చేయాలని మనతో కరచాలనం చేసిన ప్రతిసారి మనమే కుయుక్తులకు పాల్పడ్డాము.

మన జాత్య అధికారులు గూఢచర్యానికి పాల్పడిన ప్రతిసారి వాళ్లు హెచ్చరించి సగౌరవంగా పంపిస్తే మనం అకారణంగానే వాళ్ల అధికారులను చిత్రహింసలకు గురిచేసి పంపించాం. వాళ్లు లాంఛనంగా 'లాహోర్ ఢిల్లీ' బస్సు సర్వీస్ ప్రారంభిస్తే, మనం కార్గిల్ చొరబాట్లు ఆరంభించాము. మనం ఎన్ని చేస్తూ వచ్చినా వాళ్లు సహిస్తూ వచ్చారు.

పెట్రోలింగ్ కోసం వెళ్లిన తమ సైనిక టీమ్‌ను పాకిస్తాన్ సైనికులు అతిక్రూరంగా, రాక్షసంగా హింసించి జుగుప్సాకరంగా హత్య చేశారని తెలిసికూడా ప్రాణభిక్షతో వెళ్లిన ఓ పసిపాపకు గుండె ఆపరేషన్‌తో ప్రాణం పోసి తిరిగి పాకిస్తాన్‌కు సాగనంపిన మహనీయులు భారతీయులు.

ఆనాడు ముస్లింల పరిపాలనలో మనవాళ్లు మతవివక్షతో హిందూ స్త్రీలమీద జరిపిన అత్యాచారాలను, దౌర్జన్యాలను, దేవాలయాలను ధ్వంసం చేసి శిథిలాలుగా మిగిల్చినా అన్నీ మరిచిపోయి, ఇండియాలో ఉన్న ముస్లింలను తమ సోదరులుగానే పరిగణిస్తూ గౌరవిస్తున్నారు. కొందరు మతమౌఢ్యంతో బాబ్రీమసీదును కూల్చివేస్తే యావత్తు భారతదేశమంతా ముక్తకంఠంతో నిరసించారు. ఇప్పటికీ ప్రతి సంవత్సరం నిరసన దినాన్ని పాటిస్తూ వస్తున్నారు.

బద్ధ శత్రువు సైతం రక్షించమని శరణు కోరితే గుండెల్లో దాచుకుని ప్రాణాలు పణంగా పెట్టి కాపాడుతారు భారతీయులు. వాళ్ల ఔన్నత్యం గురించి ఎంత చెప్పినా కొంత మిగిలే ఉంటుంది రిఫాత్. చివరిక్షణంలో వారి పట్ల సంకోచం వద్దు. మనం త్వరగా బయలుదేరితే బ్రతికి బయటపడతాం. లేకపోతే మృత్యువును పనిగట్టుకుని మనమే ఆహ్వానించిన వాళ్లమవుతాం..."

బయలుదేరడానికి ఉద్యుక్తుడనయ్యాను. ఆమె బేలగా చూసింది. కాని అప్పటికే ఆలస్యం జరిగిపోయింది. లేచి నిలబడబోతున్న వాడినల్లా ఎదురుగా కనబడిన దృశ్యానికి అలాగే కూర్చుండిపోయాను. రిఫాత్ భయంతో బిగుసుకుపోయింది.

ఎదురుగా... మృత్యువురూపంలో అతను.

నెత్తిమీద 'ఇస్లాం టోపీ' బారెడు పెరిగిన గడ్డం. చేతిలో తల్వార్. కుర్తాపైజామాలో జిహాద్‌లోని సైనికుడిలా... ఇస్లాం పరిరక్షణే తన ధ్యేయంగా అన్నట్టుగా ఉన్నాడు.

"మీరు తప్పు చేశారు. ఖురాన్‌ను ఉల్లంఘించారు. అల్పుడైన మానవుని కళ్లు కప్పి ఇక్కడి వరకు చేరుకోగలిగారు. కాని అల్లా దృష్టిని అంధకారం చేయలేకపోయారు. అందుకే చిక్కిపోయారు. ఎందుకంటే ఆయన అనంతమైన సృష్టి... సర్వాంతర్యామి కాబట్టి. మీరు చేసిన తప్పుకు శిక్షేమిటో తెలుసా...?" అతని చేతిలోని తల్వార్ చప్పున గాలిలోకి లేచింది.

నేను అంతకంటే వేగంగా కదులుతానని అతను ఊహించి వుండడు. పిడికిళ్లలో బిగుసుకున్న ఇసుక వెళ్లి అతని కళ్లలో కుప్పగా పడింది. నేను అదే వేగంతో ఎగిరి అతని రెండు తొడలమధ్య లాగి తన్నాను. అతను కనీసం ఆర్తనాదం కూడా చేయలేదు. కూలిన వృక్షంలా వెనక్కు విరుచుకుపడ్డాడు.

అతను చావడని తెలుసు. అతడ్ని చంపాలని కూడా నా ఉద్దేశ్యం కాదు. హాస్పటల్‌లో చేరితే గాని అతను స్పష్టంగా చూడలేడు. ఆ మాత్రం అవకాశం మాకు చాలు సరిహద్దు దాటటానికి.

భయకంపితురాలైన రిఫాత్ ఛిద్రమైన తన పాదం విషయం కూడా మరిచిపోయింది. వరుగు లంఘించాం ఇద్దరం.

తూర్పు భళ్లున తెల్లవారుతుంటే చీకట్లు చిన్నాభిన్నమై వెలుగు పరుచుకుంటుంది. దూరంగా స... రి... హ... ద్దు...

పొంగిపొరలి వచ్చిన అనేకమైన ప్రవాహాలను సైతం ఎంతో ఆదరణతో తనలో కలుపుకునే సాగరంలా... భిన్న జాతులను, విభిన్న సాంప్రదాయాలను, సంస్కృతులను తనలో నిలుపుకొని ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నట్టు భారత స... రి... హ... ద్దు.

అక్కడ, 'అందరిని మేము ప్రేమిస్తామే గాని ఎవరిని ద్వేషించం... మిత్రులు, శత్రువులు అందరూ ఆహ్వానితులే!' అంటూ పైరగాలికి మువ్వన్నెల జెండా రెపరెపలాడుతూ మాకు స్వాగతం పలుకుతున్నట్టుగా వుంది.

మాలో ఒక్కసారిగా అలసట తగ్గి ముఖాల్లో చిరునవ్వు వికసించింది. నెమ్మదిగా అటుగా నడిచాము.

ఇప్పుడు... ఒక వ్యక్తికాదు, ఒక ఊరుకాదు ఒక దేశమే మాకు కొండంత అండగా నిలిచినట్టు ఫీలింగ్ మాలో!

■

